జ్వాల తెలుగు న్యూస్
RNI NO: TELTEL/2023/88524
# మెదక్ టుడే
MEDAK TODAY
తెలుగు దిన పత్రిక...
21 మార్చి 2026 మెదక్ పేజీలు :4 వెల రూ.:2 ఎడిటర్: సిహెచ్. శివకుమార్ సంపుటి 04 సంచిక 112

# ప్రజా సంక్షేమ‘పద్దు’

**రూ.3.24 లక్షల కోట్లతో 2026-27 బడ్జెట్**

**అసెంబ్లీలో ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క**

**ఇందిరమ్మ రాజ్యానికి ఆర్థిక బాట**



**ప్రతి గడపకూ రూ.5 లక్షల బీమా ధీమా!**

**విద్యార్థుల కలలకు జీవం: బ్రేక్‌ఫాస్ట్ నుంచి ఇంటర్ భోజనం వరకు నూతన విప్లవం**

**సామాజిక సమానత్వానికి కేరాఫ్ ‘యంగ్ ఇండియా’ స్కూల్స్: రూ.26 వేల కోట్లతో విద్యారంగం పునర్నిర్మాణం**

**అన్నదాతకు అండగా రూ.23 వేల కోట్లు**

**వ్యవసాయం, సాగునీటి రంగాలకు భారీ పీట**

**మొత్తం వ్యయం: రూ. 3,24,234 కోట్లు**
**రెవెన్యూ వ్యయం: రూ. 2,34,406 కోట్లు**
**మూలధన వ్యయం: రూ. 47,267 కోట్లు**
**రాష్ట్ర తలసరి ఆదాయం: రూ. 4,18,931 (దేశ సగటు కంటే మెరుగ్గా)**
**బహిరంగ మార్కెట్ రుణాలు: రూ. 73,383 కోట్లు**

**హైదరాబాద్ మార్చి 20:** తెలంగాణ ఉపముఖ్యమంత్రి, ఆర్థికమంత్రి మల్లు భట్టి విక్రమార్క శాసనసభలో రూ.3,24,234 కోట్లతో 2026-27 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. సామాజిక న్యాయం, విద్యార్థుల సాధికారత మరియు సామాన్యుడికి భరోసా ఇచ్చేలా ఈ బడ్జెట్ రూపకల్పన జరిగింది.

**నూతన పథకాలు: ఇందిరమ్మ అభయం**

బడ్జెట్‌లో కొన్ని విప్లవాత్మకమైన కొత్త పథకాలను ప్రభుత్వం ప్రకటించింది: ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా: రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షల జీవిత బీమా సౌకర్యం. కుటుంబ పెద్ద అకాల మరణం చెందితే ఆ కుటుంబం రోడ్డున పడకుండా ఈ పథకం ఆదుకుంటుంది. దీని కోసం రూ.4,000 కోట్లు కేటాయించారు. ఇది 2026 జూన్ 2 నుంచి అమల్లోకి వస్తుంది.

**విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ పథకం:** ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థులకు ఉదయం పోషకాహారం. వారానికి మూడు రోజులు పాలు, మూడు రోజులు రాగిజావ అందించనున్నారు.

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కూడా ఇకపై మధ్యాహ్న భోజనం అందనుంది.

విద్యారంగంలో చారిత్రాత్మక మార్పులు

విద్య కోసం ప్రభుత్వం ఏకంగా రూ. 26,674 కోట్లు కేటాయించింది.

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్

మిగతా 2లో

## ట్రంప్ ‘పెరల్ హార్బర్’ పంచ్

**ఓవల్ ఆఫీసులో జపాన్ ప్రధానికి షాక్!**
**మిరెందుకు మాకు చెప్పలేదు?**
**ఇరాన్ దాడులపై ప్రశ్నిస్తే పాత గాయాలను కెలికిన ట్రంప్**
**నోరెళ్లబెట్టిన రిపోర్టర్లు**

2



రాజశేఖరుడి ఆశయమా...

## రాజకీయ అవసరమా?

**వారసత్వ ఆస్తులపై తేలని పంచాయితీ**
**పుత్రుడికి విన్నపం..**
**పుత్రికకు బాసట**
**ఆస్తుల రగడపై విజయమ్మ నిర్మొహమాట ప్రకటన!**
**దేవుడికి తెలుసు..**
**జగన్‌కు తెలుసు”**
**అసత్య ప్రచారాలపై వైఎస్. విజయమ్మ**



2

వైఎస్సార్ కుటుంబంలో ఆస్తుల చిచ్చు ఆరడం లేదు. తాజాగా వైఎస్ విజయమ్మ విడుదల చేసిన బహిరంగ లేఖ ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. కేవలం ఒక తల్లిగానే కాకుండా, వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆశయాలకు వారసురాలిగా ఆమె ఈ లేఖలో సంధించిన ప్రశ్నలు ఇప్పుడు చర్చనీయాంశమయ్యాయి.



2

## ఉగాది వేళ తీరని శోకం

**గోదావరిలో ఐదుగురు యువకులు గల్లంతు!**
**ఇంజనీరింగ్ విద్యార్థుల ప్రాణాలు తీసిన గోదావరి**
**పురుషోత్తపట్నం రేవు వద్ద విషాదం**
**ముగ్గురు మృతి, ఇద్దరి కోసం కొనసాగుతున్న వేట**
**సరదా తీరని సెల్ఫీలు.. మిగిలిన కన్నటి గాథలు!**

## అక్షర యోధులకు అన్యాయం !

**జర్నలిస్టుల ఆశలపై ‘బడ్జెట్’ నీళ్లు**
**వంద కోట్ల నిధి ఏమైంది?**
**ఇళ్ల స్థలాల ఊసే లేదు..**
**హెల్త్ కార్డుల మాటే లేదు**
**ప్రజాస్వామ్య నాలుగో స్తంభానికి కనీస గౌరవం దక్కలేదా?**

2

## ఇంటి తాళం తీస్తారా? వదులుకుంటారా?

**డబుల్ ఇళ్లకు ‘రెవర్స్’ నోటీసు**
**ఇల్లు మీదా? పేదలదా?**
**తేల్చనున్న సర్కార్**
**అద్దె మాఫియాపై ‘సర్జికల్ స్ట్రైక్’**
**డబుల్ ఇళ్లపై క్షేత్రస్థాయిలో కలెక్టర్ల వేట**
**8 వేల ఇళ్లపై పునఃసమీక్ష**
**త్వరలో కొత్త పట్టాలు**
**కాలనీల్లో ‘సెల్ఫ్ గవర్నెన్స్’**
**దుకాణాల వేలం ద్వారా అభివృద్ధికి బాటలు**



“గూడు లేని పేదవాడికి నీడ దక్కాలి.. కానీ ఉన్న ఇల్లును వ్యాపారంగా మార్చకూడదు” - ఇదే నినాదంతో తెలంగాణ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల అక్రమాలపై ఉక్కుపాదం మోపుతోంది. కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన ఇళ్లను సొంతం చేసుకుని, వాటిని నిరుపయోగంగా ఉంచిన వారికి ప్రభుత్వం ‘లాస్ట్ వార్నింగ్’ ఇచ్చింది.

2



**బడ్జెట్ అంటే...**

## ‘తెలంగాణ రైజింగ్’

**సంక్షేమం అభివృద్ధి కలగలిసిన విజన్!**
**అప్పుల ఊబిలోంచి బయటపడే ప్రయత్నం**
**రూ. 3.30 లక్షల కోట్లు పాత బాకీలకే సరి!**
**మూసీ డీపీఆర్ సిద్ధం – కేంద్రంపై ఒత్తిడి**
**రాజధాని రూపురేఖలు మార్చేందుకు సీఎం సిద్ధం**
**ఫోన్ ట్యాపింగ్ మిస్టరీ వీడుతోంది**
**ప్రభాకర్ రావు రాకతో దర్యాప్తులో పెరిగిన వేగం**
**మీడియాతో చిట్‌చాట్‌లో సీఎం రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్ మార్చి 20:** తెలంగాణ శాసనసభలో బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీడియా ప్రతినిధులతో ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, విద్యా సంస్కరణలు, మరియు ప్రత్యర్థి పార్టీలపై తనదైన శైలిలో విమర్శనాస్త్రాలు సంధించారు. ఈ బడ్జెట్ కేవలం అంకెల పద్దు కాదు, రాష్ట్ర భవిష్యత్తుకు ఒక ‘మైలురాయి’ అని ఆయన అభివర్ణించారు.

**విద్యావిధానంలో సమూల మార్పులు: ‘ప్రీ-ప్రైమరీ టు ప్లస్ టూ’**

రాష్ట్ర విద్యా వ్యవస్థను జాతీయ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతామని సీఎం ప్రకటించారు. ప్రీ-ప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులు ఒకే ప్రాంగణంలో చదువుకునేలా నూతన విధానం రాబోతోంది. విద్యా సంస్కరణలపై కమిటీ అధ్యయనం

మిగతా 2లో

# ఇది ‘ప్యూర్’ మోడల్ కాదు.. ‘చోర్’ మోడల్

**బడ్జెట్ అంతా అబద్ధాల పద్దు**
**రైతుబంధుకు మంగళం.. గ్యారంటీలకు కోత**
**రైతులకు సీఎం క్షమాపణ చెప్పాల్సిందే!**
**తెలంగాణ ఆదాయం పతనం**
**ప్యూర్ మోడల్’ పేరుతో సిటీ విభజనపై ధ్వజం**
**జాబ్ క్యాలెండర్ ఎక్కడ? నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లిన బడ్జెట్!**
**మూడుసార్లు రైతుబంధు ఎగ్గొట్టారు..**
**సీఎం రేవంత్ ముక్కు నేలకు రాయాలి**
**మాజీ మంత్రి హరీష్‌రావు**

**హైదరాబాద్ మార్చి 20:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంతా అబద్ధాల పుట్ట అని, తెలంగాణ ప్రయోజనాలను దెబ్బతీసేలా ఉందని బీఆర్ఎస్ నేత హరీష్ రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బడ్జెట్ ప్రసంగం అనంతరం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడిన ఆయన, ప్రభుత్వం అంకెలను తారుమారు చేస్తూ ప్రజలను వంచిస్తోందని ఆరోపించారు.

రైతుబంధు ఎగవేత – సీఎంకు సవాల్!

రైతు సంక్షేమం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని హరీష్ రావు విమర్శించారు “అధికారంలోకి వచ్చాక మూడుసార్లు రైతుబంధు ఆపినందుకు సీఎం రేవంత్ రెడ్డి ముక్కు నేలకు రాసి రైతులకు క్షమాపణ చెప్పాలి” అని

మిగతా 2లో



## ‘ప్రజా సంక్షేమ’ పద్దు

రెసిడెన్షియల్ స్కూల్స్: అన్ని వర్గాల విద్యార్థులు ఒకే చోట చదువుకునేలా 105 పాఠశాలల నిర్మాణం. డిజిటల్ సదుపాయాలు, రవాణా సౌకర్యాలతో ఆధునిక క్యాంపస్‌ల ఏర్పాటు.

ప్రధాన శాఖల వారీగా కేటాయింపులు (కోట్లలో):

పంచాయతీరాజ్ శాఖ రూ.33,688 ।
విద్యాశాఖ రూ.26,674 ।
వ్యవసాయశాఖ రూ.23,179
నీటిపారుదల శాఖ రూ. 22,615
విద్యుత్ శాఖ రూ. 21,285
పురపాలకశాఖ రూ. 17,907
వైద్యశాఖ రూ. 13,679
హోంశాఖ రూ. 11,907
దీజ సంక్షేమం రూ. 12,511 ।
సంక్షేమం రూ.11,784

“సామాజిక, ఆర్థిక న్యాయం అందించడమే మా లక్ష్యం” అని భట్టి విక్రమార్క ప్రకటించినట్లుగా, ఈ బడ్జెట్ పేద మరియు మధ్యతరగతి వర్గాలకు పెద్దపీట వేసింది. గోదావరి పుష్కరాల కోసం రూ.500 కోట్లు, రాజీవ్ యువవికాసం కోసం రూ.6 వేలు కోట్లు కేటాయించడం ద్వారా అన్ని రంగాలను సమన్వయం చేశారు.

## ఉగాది వేళ తీరని శోకం

**భద్రాచలం/ఎటపాక:** పండుగ సెలవుల వేళ సరదాగా గోదావరిలో స్నానానికి వెళ్లిన విద్యార్థుల జీవితాలు నదిలో కలిసిపోయాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం పురుషోత్తపట్నం రేవు వద్ద గోదావరి నదిలో స్నానానికి దిగిన ఏడుగురు విద్యార్థుల్లో ఐదుగురు గల్లంతయ్యారు. వీరిలో ముగ్గురి మృతదేహాలు లభ్యం కాగా, మిగిలిన ఇద్దరి కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

అసలేం జరిగిందంటే?

అమరావతిలోని ఎస్‌ఆర్‌ఎం ఇంజినీరింగ్ కళాశాలలో రెండో సంవత్సరం చదువుతున్న ఏడుగురు విద్యార్థులు ఉగాది సెలవుల నేపథ్యంలో భద్రాచలం సందర్శనకు వెళ్లారు. శుక్రవారం ఉదయం పురుషోత్తపట్నం రేవు వద్ద స్నానానికి దిగారు. నది లోతుపై అవగాహన లేకపోవడంతో ప్రమాదవశాత్తూ ఐదుగురు యువకులు నీటి ఉధృతికి కొట్టుకుపోయారు. మిగిలిన ఇద్దరు విద్యార్థులు చాకచక్యంగా ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకోవడంతో ప్రాణాపాయం తప్పింది.

బాధితుల వివరాలు

గల్లంతైన ఐదుగురిలో ముగ్గురి మృతదేహాలను గజ ఈతగాళ్లు వెలికితీశారు.

లభ్యమైన మృతదేహాలు: నవదీప్ (ఉయ్యూరు), చారుగుండ్ల శ్రీకర్ (భద్రాచలం), పొడిచేటి అభిరామ్ (భద్రాచలం).

గాలింపు కొనసాగుతున్న వారు: గోక తేజ (ఉయ్యూరు), పాశం సతీష్ కుమార్ (మదనపల్లి).

ముమ్మరంగా గాలింపు చర్యలు

ఘటన గురించి సమాచారం అందుకున్న వెంటనే స్థానిక పోలీసులు, రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానిక మత్స్యకారులు, గజ ఈతగాళ్ల బోట్ల సాయంతో నదిలో గాలింపు చేపట్టారు. మృతుల్లో ఇద్దరు భద్రాచలానికి చెందిన వారు కాగా, మిగిలిన వారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఉయ్యూరు, మదనపల్లి ప్రాంతాలకు చెందిన వారు. విషయం తెలిసిన తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు.నదులు, కాలువల వద్ద స్నానానికి వెళ్లేటప్పుడు స్థానికుల సలహాలు తీసుకోవడం, లోతు తెలియని చోట నీటిలోకి దిగకపోవడం అత్యంత అవసరం. ఒక్క క్షణం అజాగ్రత్త నిండు ప్రాణాలను బలి తీసుకుంటుంది

## బడ్జెట్ అంటే తెలంగాణ రైజింగ్



చేస్తోందని, జాతీయ స్థాయి విశ్లేషణ తర్వాతే తుది నిర్ణయం ఉంటుందని స్పష్టం చేశారు.

**అప్పుల చిక్కుముడి - శ్వేతపత్రం లాంటి వివరణ**

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై రేవంత్ రెడ్డి కీలక గణాంకాలను వెల్లడించారుతాము అధికారంలోకి వచ్చాక చేసిన రూ. 3.47 లక్షల కోట్ల అప్పులో, ఏకంగా రూ. 3.30 లక్షల కోట్లు గత ప్రభుత్వం చేసిన అప్పుల వడ్డీలు, అసలు చెల్లించడానికే వాడినట్లు చెప్పారు. కొత్తగా తెచ్చిన అప్పుల్లో కేవలం రూ. 17 వేల కోట్లు మాత్రమే రాష్ట్ర అవసరాలకు వాడుకున్నామని వివరించారు.కాళేశ్వరం నుంచి చుక్క నీరు రాకపోయినా, దాని కోసం చేసిన రూ. 44 వేల కోట్ల అప్పును తామే తీరుస్తున్నామని మండిపడ్డారు.మూసీ పునరుజ్జీవం, ఫోన్ ట్యాపింగ్ మూసీ ప్రక్షాళన విషయంలో వెనక్కి తగ్గేది లేదని, ఏడీబీనిధులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. బాధితులకు మాత్రం పూర్తి స్థాయిలో అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు ప్రభాకర్ రావు అందుబాటులోకి రావడంతో విచారణ వేగవంతమైందని, చట్టప్రకారమే ముందుకు వెళ్తామని చెప్పారు.

**రాజకీయ సెటైర్లు: “చెవిటోడి ముందు శంఖం ఊదినట్లే!”**

బీఆర్ఎస్ నేతల విమర్శలపై సీఎం ఘాటుగా స్పందించారు “అల్లుడు హరీష్ రావు, కొడుకు కేటీఆర్ కలిసి కేసీఆర్‌ను గృహనిర్బంధం చేశారు. అందుకే ఆయన అసెంబ్లీకి రాలేకపోతున్నారు” అని ఎద్దేవా చేశారు. డ్రగ్స్ దొరికినా, పోలీసులపై కాల్పులు జరిగినా బీజేపీ నేతలు స్పందించకపోవడం వారిద్దరి మధ్య ఉన్న అవగాహనకు నిదర్శనమని ఆరోపించారు. జాతీయ జీడీపీ కంటే తెలంగాణ జీఎస్‌డీపీ మెరుగ్గా ఉందని, జీఎస్టీ వసూళ్లు కూడా ఆశాజనకంగా ఉన్నాయని చెప్పడం ద్వారా రాష్ట్ర ఆర్థిక పురోగతిపై సీఎం ధీమా వ్యక్తం చేశారు. సంక్షేమ గ్యారెంటీలను ఆర్థిక వెసులుబాటును బట్టి పక్కాగా అమలు చేస్తామని పునరుద్ఘాటించారు.

# ఇంటి తాళం తీస్తారా? వదులుకుంటారా?

**హైదరాబాద్ మార్చి20:** “గూడు లేని పేదవాడికి నీడ దక్కాలి.. కానీ ఉన్న ఇల్లును వ్యాపారంగా మార్చకూడదు” - ఇదే నినాదంతో తెలంగాణ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల అక్రమాలపై ఉక్కుపాదం మోపుతోంది. కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన ఇళ్లను సొంతం చేసుకుని, వాటిని నిరుపయోగంగా ఉంచిన వారికి ప్రభుత్వం ‘లాస్ట్ వార్నింగ్’ ఇచ్చింది.

**తాళం వెనుక అసలు కథేంటి?**

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 17 ప్రధాన ప్రాంతాల్లో సుమారు 90 వేల ఇళ్లు ఉండగా, వాటిలో 8,000 ఇళ్లు ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారాయి. చాలామంది లబ్ధిదారులు ఇళ్లను కేవలం ఆస్తిగా భావించి తాళం వేశారు. మరికొందరు నిబంధనలకు విరుద్ధంగా ఇతరులకు అద్దెకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. వసతులు లేవనే సాకును చెరిపివేస్తూ, విద్యుత్, తాగునీరు, రోడ్ల కోసం కోట్లు ఖర్చు చేసిన ప్రభుత్వం.. ఇప్పుడు “నివసించకపోతే నిష్క్రమించండి” అని తెగేసి చెబుతోంది.

**వెయిటింగ్ లిస్ట్‌లోని పేదలకు ‘శుభవార్త’**

ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకుని ఏళ్ల తరబడి అద్దె ఇళ్లలో మగ్గుతున్న నా-2 జాబితాలోని పేదలకు ఈ నిర్ణయం వరంలా మారనుంది. ఈ నెలాఖరులోపు ఇళ్లను వెనక్కి తీసుకునే ప్రక్రియ పూర్తి చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఖాళీ అయిన ఇళ్లను వెనువెంటనే కొత్త లబ్ధిదారులకు కేటాయించి, వారికి పట్టాలు పంపిణీ చేసేందుకు జిల్లాల కలెక్టర్లు ప్రణాళికలు సిద్ధం చేశారు.

**‘మోడల్ కాలనీ’గా మార్పు: గల్లీ బజార్లు, వేలం**

కేవలం ఇళ్లు ఇవ్వడమే కాదు, ఆ కాలనీలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కొత్త పంథాను అనుసరిస్తోంది కాలనీల్లోని ఖాళీ దుకాణాలను బహిరంగ వేలం వేయడం ద్వారా వచ్చే ఆదాయాన్ని అక్కడి పారిశుద్ధ్యం, నిర్వహణ పనులకే వాడతారు. నిత్యావసరాల కోసం ప్రజలు బయటకు వెళ్లకుండా కాలనీల్లోనే ‘గల్లీ బజార్ల’ను ఏర్పాటు చేసి స్థానికంగా ఉపాధిని కూడా కల్పిస్తున్నారు.నిజమైన పేదవాడికి న్యాయం జరగాలనే ప్రభుత్వ సంకల్పం ఇందులో కనిపిస్తోంది. కేటాయించిన ఇళ్లను వాడుకోని వారు, గృహ అవసరం లేని వారిగా పరిగణించబడతారు కాబట్టి, ఆ అవకాశాన్ని మరొకరికి ఇవ్వడమే సరైన సామాజిక న్యాయం.

# రాజశేఖరుడి ఆశయమా రాజకీయ అవసరమా?

**అమరావతి మార్చి 20:** వైఎస్సార్ కుటుంబంలో ఆస్తుల చిచ్చు ఆరడం లేదు. తాజాగా వైఎస్ విజయమ్మ విడుదల చేసిన బహిరంగ లేఖ ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. కేవలం ఒక తల్లిగానే కాకుండా, వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆశయాలకు వారసురాలిగా ఆమె ఈ లేఖలో సంధించిన ప్రశ్నలు ఇప్పుడు చర్చనీయాంశమయ్యాయి.విజయమ్మ తన లేఖలో ప్రాథమిక సత్యాన్ని కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి బతికున్నంత కాలం ఆ ఆస్తులన్నీ ఉమ్మడివేనని, అవి ఎప్పుడూ వేరుపడలేదని ఆమె స్పష్టం చేశారు. “నలుగురు మనవలకు (జగన్, షర్మిల పిల్లలకు) ఆస్తులు సమానంగా పంచాలి” అన్నది వైఎస్సార్ అంతిమ నిర్ణయమని, అది జగన్ కూడా తెలిసిన సత్యమేనని గుర్తు చేశారు.

**జగన్‌కు తల్లి సూటి ప్రశ్నలు.. షర్మిలకు మద్దతు!**

షర్మిలకు అన్యాయం జరిగిందని విజయమ్మ ఈ లేఖ ద్వారా బహిరంగంగానే అంగీకరించారు. జగన్ తన చెల్లికి ఇచ్చానని చెబుతున్న కోట్లాది రూపాయలు ఆస్తి కాదని, అది కేవలం కంపెనీల నుంచి వచ్చిన లాభాల్లో (ణఱఙఱఅఙవఅ) వాటా మాత్రమేనని క్లారిటీ ఇచ్చారు. ఎంవోయూలో లేని యెలహంక ల్యాండ్, సరస్వతి పవర్ ఆస్తులపై షర్మిలకు పూర్తి హక్కు ఉందని, తన మేనల్లుడు, మేనకోడలికి జగన్ అన్యాయం చేశాడని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. “ఎప్పటికైనా నా కొడుకు న్యాయం చేస్తాడని తల్లిగా ఆశిస్తున్నాను” అని పేర్కొన్నారు.

**ఎన్‌సీఎల్‌టీ వేదికగా విజయమ్మ పోరాటం** సరస్వతి పవర్ ఆస్తుల బదిలీ విషయంలో తనపై వస్తున్న ఆరోపణలను ఆమె తిప్పికొట్టారు తాను షర్మిలకు బినామీని కాదని, స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకుంటున్నానని ఎన్‌సీఎల్‌టీకి నివేదించారు. జగన్, భారతిలు ఇచ్చిన గిఫ్ట్ డీడ్ ద్వారా తనకు ప్రయోజనం చేకూరిన మాట వాస్తవమేనని, ఆ తర్వాతే చట్టబద్ధంగా వాటాల కొనుగోలు ఒప్పందం చేసుకున్నానని వివరించారు.“వైఎస్సార్ భార్యగా చేతులు జోడించి అడుగుతున్నాను.. గ్లోబెల్స్ ప్రచారాలు ఆపండి” అని విజయమ్మ చేసిన విన్నపం ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చకు దారితీసింది. ఆస్తుల పంపకం విషయంలో జగన్ తన నిర్ణయాన్ని మార్చుకుంటారా లేదా అన్నది ఇప్పుడు ఉత్కంఠగా మారింది.

## వైట్ హౌస్‌లో ‘హిస్టరీ’ క్లాస్

**వాషింగ్టన్ మార్చి 20:** దౌత్యపరమైన మర్యాదలు, ప్రోటోకాల్స్ కంటే తనదైన ‘సర్‌ప్రైజ్’ వ్యూహాలకే ప్రాధాన్యతనిచ్చే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి వార్తల్లో నిలిచారు. వైట్ హౌస్‌లోని ఓవల్ ఆఫీసులో జపాన్ ప్రధాని సనేయి తకాయిచితో భేటీ అయిన సందర్భంగా, ఆయన చేసిన వ్యాఖ్యలు జపాన్ ప్రతినిధి వర్గాన్ని ఉక్కిరిబిక్కిరి చేశాయి. 85 ఏళ్ల క్రితం నాటి చేదు జ్ఞాపకాన్ని గుర్తు చేస్తూ ట్రంప్ వేసిన జోక్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

**అసలేం జరిగింది?**

ఇటీవల ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దళాలు మెరుపు దాడులు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, ఒక జపనీస్ రిపోర్టర్ ట్రంప్‌ను ఒక సూటి ప్రశ్న అడిగారు: “మిత్రదేశాలతో సంప్రదించకుండా ఇరాన్‌పై అంత ఆకస్మికంగా ఎందుకు దాడి చేశారు?”దీనికి ట్రంప్ తనదైన ‘ట్రేడ్ మార్క్’ స్టయిల్‌లో బదులిచ్చారు. “మేము ఎవరికీ చెప్పలేదు, ఎందుకంటే అందరినీ సర్‌ప్రైజ్ చేయాలనుకున్నాం. అసలు సర్‌ప్రైజ్ గురించి జపాన్ కంటే బాగా తెలిసిన దేశం ఏదైనా ఉంటుందా?” అని అంటూ పక్కనే ఉన్న ప్రధాని తకాయిచి వైపు చూశారు.

**పెరల్ హార్బర్ ప్రస్తావన.. స్టన్ అయిన తకాయిచి!**

అక్కడితో ఆగని ట్రంప్, “సరే.. మరి పెరల్ హార్బర్ మీద దాడి చేసే ముందు మీరు మాత్రం నాకు ఎందుకు చెప్పలేదు?” అంటూ ఎదురు ప్రశ్నించారు. ఈ మాట వినగానే పక్కనే ఉన్న జపాన్ ప్రధాని ఒక్క క్షణం నిర్ఘాంతపోయారు. 1941లో జరిగిన ఘటనను, తాను పుట్టకముందు (1946) జరిగిన యుద్ధాన్ని ట్రంప్ ఇప్పుడు ప్రస్తావించడం అందరినీ ఆశ్చర్యపరిచింది.

చరిత్ర పుటల్లో పెరల్ హార్బర్

ట్రంప్ ప్రస్తావించిన ఆ చారిత్రక ఘటన వెనుక ఉన్న భయానక నిజాలు ఇవే:

తేదీ: డిసెంబర్ 7, 1941.

ఘటన: హవాయిలోని అమెరికా మిలిటరీ బేస్ లి’పెరల్ హార్బర్’లిపై జపాన్ ఆకస్మికంగా విమాన దాడులు చేసింది.

నష్టం: ఈ దాడిలో సుమారు 2,400 మంది అమెరికన్ సైనికులు మరణించారు. ఇది రెండో ప్రపంచ యుద్ధంలో అమెరికా నేరుగా పాల్గొనడానికి ప్రధాన కారణమైంది.

రెండో ప్రపంచ యుద్ధం ముగిసి 8 దశాబ్దాలు గడిచినా, ఇప్పుడు ఇరు దేశాలు ప్రాణమిత్రులుగా ఉన్నా.. ట్రంప్ ఆ పాత గాయాన్ని ప్రస్తుత రాజకీయ పరిణామాలకు ముడిపెట్టడం గమనార్హం. డోనాల్డ్ ట్రంప్ రాజకీయాల్లో ‘అన్ ప్రెడిక్టబిలిటీ’ (ఊహకందని తీరు)కి మారుపేరు. జపాన్ ప్రధాని ముందు పెరల్ హార్బర్ ప్రస్తావన తీసుకురావడం ద్వారా, అమెరికా తన ప్రయోజనాల కోసం ఏ నిర్ణయమైనా ఆకస్మికంగా తీసుకుంటుందని ఆయన పరోక్షంగా హెచ్చరించినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

## ఇది ‘ప్యూర్’ మోడల్ కాదు.. ‘చోర్’ మోడల్:

డిమాండ్ చేశారు. రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నారని ధ్వజమెత్తారు.

**ఆరు గ్యారంటీలకు ‘కోత’ బడ్జెట్** గత బడ్జెట్‌తో పోలిస్తే సంక్షేమ పథకాలకు నిధులు తగ్గించడాన్ని ఆయన తప్పుపట్టారు ఆరు గ్యారంటీలకు గతంలో రూ. 56 వేల కోట్లు కేటాయించి, ఇప్పుడు దాన్ని రూ. 50 వేల కోట్లకు తగ్గించడం ఏంటని ప్రశ్నించారు. నెలకు రూ. 2,500 మహాలక్ష్మి పథకం, రూ. 4,000 వృద్ధాప్య పెన్షన్ పెరుగుదలపై బడ్జెట్‌లో స్పష్టత లేకపోవడం పేదలను మోసం చేయడమేనన్నారు.

**తలసరి ఆదాయం - అబద్ధాల లెక్కలు!**

రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై భట్టి విక్రమార్క చెప్పిన లెక్కలు వాస్తవ దూరంగా ఉన్నాయని హరీష్ రావు విమర్శించారు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉన్న తలసరి ఆదాయం కంటే ఇప్పుడు తక్కువగా ఉందని, చేతగాని పాలన వల్లే ఆదాయం పడిపోయిందని ఆరోపించారు. “హైదరాబాద్‌ను మూడు ముక్కలు చేయాలని చూడటం ప్యూర్ మోడల్ కాదు.. ఇది చోర్ మోడల్, గోల్‌మాల్ మోడల్” అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు.

**నిరుద్యోగులకు నిరాశే!**

ఉద్యోగాల భర్తీ మరియు జాబ్ క్యాలెండర్‌పై ప్రభుత్వం మౌనం వహించడాన్ని ఆయన ఆక్షేపించారు ఎన్నికల ముందు చెప్పిన 2 లక్షల ఉద్యోగాల భర్తీ గురించి బడ్జెట్‌లో ప్రస్తావన లేకపోవడం నిరుద్యోగులను వంచించడమేనన్నారు.

**జాబ్ క్యాలెండర్ మిస్సింగ్:**

కనీసం జాబ్ క్యాలెండర్ గురించి కూడా ప్రభుత్వం మాట్లాడకపోవడం బాధాకరమన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కూడా తెలంగాణ విషయంలో ఇన్ని అబద్ధాలు చెప్పలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్ సాక్షిగా ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని హరీష్ రావు తన ప్రసంగాన్ని ముగించారు.



# అక్షర యోధులకు అన్యాయం !

**హైదరాబాద్ మార్చి 20:** ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలిచే జర్నలిస్టుల విషయంలో తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ తీవ్ర నిరాశను మిగిల్చింది. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పదేపదే చెప్పిన ‘తీపి కబురు’ ముచ్చట బడ్జెట్ ప్రసంగంలో ఎక్కడా వినిపించలేదు. ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, సంక్షేమ నిధి వంటి కీలక అంశాలపై ప్రభుత్వం కనీస ప్రస్తావన కూడా చేయకపోవడంపై పాత్రికేయ సంఘాలు భగ్గుమంటున్నాయి.




**సంక్షేమ నిధికి ‘చిల్లిగవ్వ’ లేదు!**

జర్నలిస్టుల సంక్షేమం కోసం అదనంగా రూ.100 కోట్ల నిధిని కేటాయిస్తామని కాంగ్రెస్ తన మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చింది. బడ్జెట్‌లో ఆ వంద కోట్ల ఊసే లేకపోవడంపై టీయూడబ్ల్యూజే నేతలు అల్లం నారాయణ, మారుతి సాగర్ మండిపడ్డారు. మీడియా అకాడమీకి నిధుల కేటాయింపు లేకపోతే సంక్షేమ కార్యక్రమాలు ఎలా సాగుతాయని టీడబ్ల్యూజేఎఫ్ నేతలు రాంచందర్, బసవపున్నయ్య ప్రశ్నించారు.

**ఇళ్ల స్థలాలు,హెల్త్ కార్డులపై నీలినీడలు**

పాత్రికేయులు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న ఇళ్ల స్థలాల అంశం ఈ బడ్జెట్‌లోనూ అపరిష్కృతంగానే మిగిలిపోయింది. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జర్నలిస్టులకు కూడా హెల్త్ కార్డులు ఇస్తామన్న హామీ నెరవేరలేదు. అసలు జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్‌ను ప్రభుత్వం శాశ్వతంగా రద్దు చేసిందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత కనీసం అక్రిడిటేషన్ కార్డుల ప్రక్రియను కూడా వేగవంతం చేయలేదని సంఘాలు ఆవేదన వ్యక్తం చేశాయి.

**‘సమాచార శాఖ’ను మరిచిన సర్కార్?**

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే సమాచార పౌర సంబంధాల శాఖ పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శించిందని విమర్శలు వస్తున్నాయి. బడ్జెట్ ప్రసంగంలో జర్నలిస్టుల ప్రస్తావనే లేకపోవడం వల్ల వేలాది మంది పాత్రికేయుల కుటుంబాల్లో ఆందోళన నెలకొంది. చనిపోయిన జర్నలిస్టుల కుటుంబాలకు అందాల్సిన ఆర్థిక సాయంపై కూడా స్పష్టత కరువైంది. నిత్యం ప్రజా సమస్యలపై పోరాడే జర్నలిస్టుల సంక్షేమాన్ని విస్మరించడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, బడ్జెట్ కేటాయింపుల్లో లేదా అనుబంధ పద్దుల్లోనైనా జర్నలిస్టుల హామీలను నెరవేర్చాలని పాత్రికేయ లోకం కోరుతోంది.

# ముస్లిం సోదరులు సోదరిమణులకు రంజాన్ శుభాకాంక్షలు

## –మెదక్ ఎమ్మెల్యే మైనం పల్లి రోహిత్ రావ్

**మెదక్,మార్చి,20,మెదక్ టుడే. న్యూస్:**పవిత్రమైన రంజాన్ పండుగను పురస్కరించుకొని ముస్లిం లకు,నియోజకవర్గ ప్రజలకు మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావ్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పవిత్ర మాసం మనుషుల మధ్య సౌహార్దం, సహనం, సేవాభావం, దాతృత్వం వంటి గొప్ప విలువలను పెంపొందించే పవిత్ర కాలమని ఆయన పేర్కొన్నారు. రంజాన్ నెలలో ముస్లిం సోదరులు ఆచరించే ఉపవాస దీక్షలు మనిషిలో ఆత్మ నియంత్రణను పెంపొందించడమే కాకుండా, సమాజంలో సమానత్వ భావనను బలపరుస్తాయని అన్నారు. పేదవారికి సహాయం చేయడం, పరస్పరం ప్రేమాభిమానాలు పెంచుకోవడం ద్వారా సమాజంలో ఐక్యత మరింత బలపడుతుందని ఆయన ఆకాంక్షించారు.ఈ పవిత్ర పండుగ ప్రతి ఇంటిలో ఆనందం, ఆరోగ్యం, శాంతి నింపాలని, ప్రజలందరికీ సుఖసంతోషాలు కలగాలని ఎమ్మెల్యే రోహిత్ రావ్ ప్రార్థించారు. రాష్ట్ర ప్రజలందరూ ఐకమత్యంతో ముందుకు సాగుతూ అభివృద్ధి పథంలో నడవాలని ఆయన కోరారు.



# ఈద్గా వద్ద బందోబస్తు పరిశీలించిన అదనపు ఎస్ పి మహేందర్

**మెదక్:మార్చి,20,మెదక్ టుడే న్యూస్:** పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకుని నవాబ్‌పేట్‌లోని ఈద్గా వద్ద ఏర్పాటు చేసిన భద్రతా ఏర్పాట్లను అదనపు ఎస్పీ మహేందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఈద్గా పరిసరాల్లో భద్రతా చర్యలు, పార్కింగ్ ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు సూచనలు ఇచ్చారు. జిల్లా కేంద్ర పరిధిలోని మసీదుల వద్ద పటిష్ట భద్రత కల్పించినట్లు తెలిపారు.ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు. ప్రధాన రహదారులు, చౌరస్తాల్లో ప్రత్యేక పోలీసు పికెట్స్ ఏర్పాటు చేసి, రద్దీ ప్రాంతాల్లో అదనపు సిబ్బందిని మోహరించినట్లు వివరించారు. పండుగ రోజుల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతర పెట్రోలింగ్ కొనసాగిస్తామని పేర్కొన్నారు.ప్రజలు సోదరభావంతో, పరస్పర గౌరవంతో పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్న కుమార్, టౌన్ ఇన్స్పెక్టర్ మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.



# మెదక్ జిల్లాలో జూదంపై టాస్క్ ఫోర్స్ పోలీసుల ఉక్కుపాదం

## –నలుగురు అరెస్ట్ -- ఇద్దరు పరారీలో

## –రూ.4,750 నగదు, 5 మొబైల్ ఫోన్లు స్వాధీనం

## ఎస్ పి శ్రీనివాసరావు

**మెదక్,మార్చి,20,మెదక్ టుడే న్యూస్:(ప్రతినిధి)** మెదక్ జిల్లా చిల్పిచేడ్ మండలం సిలంపల్లి గ్రామ శివారులోని డంప్‌యార్డు సమీపంలో అక్రమంగా జూదం ఆడుతున్న వారిపై టాస్క్ ఫోర్స్ పోలీసులు ఆకస్మిక దాడి నిర్వహించి నలుగురిని అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్ పి శ్రీనివాసరావు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్ బృందం సంఘటనా స్థలానికి చేరుకుని జూదం ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నారు.అరెస్ట్ అయిన వారిలో వెంకటాపురం లక్ష్మణ్, జుకంటి లోకయ్య, మన్నె ప్రసాద్, యల్లయ్యగారి భూమ్ రెడ్డి ఉన్నారు. ఈ ఘటనలో రాకేష్, పెద్దొల్ల సుధాకర్ రెడ్డి పరారీలో ఉండగా, సంఘటనా స్థలం నుండి రూ.4,750 నగదు మరియు 5 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు చిల్పిచేడ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.జిల్లాలో ఎక్కడైనా జూద కార్యకలాపాలు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ పి హెచ్చరించారు. ప్రజలు ఇలాంటి కార్యకలాపాలపై సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని కోరారు.



# కాంగ్రెస్ పార్టీ మెదక్ డిసిసి ఉపాధ్యక్షుడుగా రజనకు ప్రవీణ్ కుమార్

**చేగుంట మార్చి 20 మెదక్ టుడే న్యూస్** మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీకి కొత్త ,డిసిసి ఉపాధ్యక్షులుగా చేగుంట మండలం వడియారం గ్రామ నివాసి అయిన రజనకు ప్రవీణ్ కుమార్ నియమితులయ్యారుఈ సందర్భంగా ఈరోజు హైదరాబాద్‌లోని కొంపల్లిలో దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి ని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సమావేశంలో శ్రీనివాస్ రెడ్డి రజనక ప్రవీణ్ కుమార్ శాలువాతో ఘనంగా సత్కరించి, హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారుఈ కార్యక్రమంలో చేగుంట సంద్రుగు సతీష్, సోలిపేట ప్రసాద్ రెడ్డి, కోమటిరెడ్డి పద్మా రెడ్డి, ఎల్లారావు తదితర ప్రముఖులు పాల్గొని అభినందనలు తెలిపారు



# విద్యా రంగానికి లో బడ్జెట్‌లో మొండిచేయి

**చేగుంట మార్చి 20 మెదక్ టుడే న్యూస్** చేగుంట మండల, తపస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చల్లా లక్ష్మణ్ మాట్లాడుతూ పెండింగ్ బిల్లులు, పిఆర్సీ ప్రస్తావన లేకపోవడం దారుణం అని,ఉద్యోగుల ఆరోగ్య పథకం క్రింద ఉచిత వైద్యం స్వాగతించాల్సిన అంశమే అయినా నిర్దిష్ట నిధులు సరిపోవు అని,2026 - 27 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన రూ 3,24,234 కోట్ల బడ్జెట్ లో విద్య, మానవ వనరులకు కేటాయించింది 26,674 కోట్లు మాత్రమే. ఇది మొత్తం బడ్జెట్లో 8.2% అని, గత సంవత్సరం కంటే రూ 3,566 కోట్లు అదనంగా కేటాయించినప్పటికీ పెంచిన మొత్తం బ్రేక్ ఫాస్ట్, ఇంటర్ వరకు మధ్యాహ్న భోజన పథకం విస్తరణ, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు విటన్నిటి కోసంసరిపోవు అని,విద్యకు 15% కేటాయిస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్న హామీ వరుసగా మూడవ బడ్జెట్ లో కూడా నెరవేరలేదు అని, రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ ను సమీక్షించి కనీసం 18% కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తపస్ చేగుంట మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రావుల వెంకటేష్, తంగేళ్లపల్లి కృష్ణమూర్తి, తపస్ జిల్లా నాయకులు సురేందర్, దేశపతి కృష్ణమూర్తి, రమేష్, బాల్ శెట్టి రేఖ,సుమతి, అమరేశ్వరి తదితరులు పాల్గొన్నారు,



# యూరియా,గ్యాస్ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవు

## –జిల్లా అదనపు కలెక్టర్ నగేష్.

**పాపన్నపేట,మార్చి,20, మెదక్ టుడే న్యూస్:** యూరియా, గ్యాస్ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు.శుక్రవారం పాపన్నపేట మండల కేంద్రంలోనీ రైతు అగ్రో సెంటర్ ను , ప్యాక్స్ యూరియా స్టాక్ వివరాలను, గ్యాస్ గోదామును పరిశీలించారు.ఎరువులు మందులు రికార్డులను,



గ్యాస్ బుకింగ్ రికార్డును పరిశీలించారు.ఈసందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. జిల్లాలో ఎలాంటి



ఎరువులు, మందులు, గ్యాస్ కొరత లేదని స్పష్టం చేశారు.గ్యాస్ గాని, ఎరువులు మందుల గురించి కృత్రిమ కొరత సృష్టిస్తే చట్టరీత్యా కఠిన చర్యలుతీసుకుంటామన్నారు. రైతులకు,వినియోగదారులకు ఇలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను సూచించారు.ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ముస్లిం సోదరులకు పవిత్ర రంజాన్ శుభాకాంక్షలు

## మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్



**మెదక్,మార్చి,20,మెదక్ టుడే న్యూస్:** పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకుని మెదక్ జిల్లాలోని ముస్లిం సోదర సోదరీమణులందరికీ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. రంజాన్ మాసం క్రమశిక్షణ, దాతృత్వం, మత సామరస్యానికి ప్రతీక అని పేర్కొన్నారు. నెల రోజుల పాటు అత్యంత భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు ఆచరించి, ప్రార్థనలు నిర్వహించిన ముస్లిం సోదరులకు ఈ పండుగ ఆనందాన్ని, ఆరోగ్యాన్ని చేకూర్చాలని శుక్రవారం ఒక ప్రకటనలో ఆకాంక్షించారు.


# పీడీఎస్ బియ్యం పట్టివేత...

**పాపన్నపేట,మార్చి,20,మెదక్ టుడే న్యూస్:**అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ (చౌకబియ్యం) పట్టుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు.శుక్రవారం పాపన్నపేట శివారులో మెదక్ వైపు నుంచి బొడ్మట్ పల్లి వైపు వెళ్తున్న ఓ వ్యాన్ ను తనిఖీ చేయగా అందులో ఉన్న సుమారు 224 క్వింటాళ్ల పీడీఎస్ (చౌకబియ్యం) పట్టుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు.పౌరసరఫరాల శాఖ అధికారులకు సమాచారం అందించడంతో వారు అక్కడికి చేరుకొని పంచనామా నిర్వహించారు.వారి ఫిర్యాదు మేరకు బియ్యం తరలిస్తున్న అశోక్, డ్రైవర్ వెంకట్ రెడ్డిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.ఎక్కడైనా పీడీఎస్ బియ్యం రవాణా చేస్తే చట్టపరంగా చర్యలు తప్పవని ఎస్సై శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు.



### ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా

# ఆంధ్రావాలా మే 20న రీ రిలీజ్





ఆంధ్రావాలా 2004, జనవరి 1న విడుదలైన తెలుగు చలనచిత్రం. పూరి జగన్నాథ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో జూనియర్ ఎన్.టి.ఆర్, రక్షిత, సాయాజీ షిండే, రాహుల్ దేవ్ తదితరులు నటించగా, చక్రి సంగీతం అందించాడు. సింహాద్రి సినిమా తరువాత భారీ అంచనాలతో తెరకెక్కిన ఈ చిత్రంలో ఎన్.టి.ఆర్. ద్విపాత్రాభినయం చేశాడు. ఆంధ్రావాలా సినిమాను ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్బంగా మే 20న రీ రిలీజ్ చేస్తున్నారు, ఆంధ్రావాలా సినిమాలో అన్ని సాంగ్స్ మ్యూజికల్ హిట్స్ అయ్యాయి, ఇప్పటికీ ఈ మూవీ సాంగ్స్ మ్యూజిక్ ఛానెల్స్ లో ఎఫ్ఎం లో వినిపిస్తూనే ఉంటాయి, ఫాన్స్ ఒ ఆడియన్స్ ఈ సినిమాను ఎంజాయ్ చెయ్యడం ఖాయం. ముంబై ధారావి ప్రాంతంలోని ఉత్తరాది ప్రజల పెత్తనానికి, అణిచివేతకు గురవుతున్న ఆంధ్రుల కష్టాలను తొలగించడానికి తిరుగుబాటు చేసిన వ్యక్తి కథాశం ఈ ఆంధ్రావాలా సినిమా.

## ఆమె పాటకు సీఎం సైతం ఫిదా..



శ్రేయా మ్యూజికల్ స్టేజ్ షో చేసిందీ అంటే సంగీత ప్రియులు మైమరచిపోతారు. ఈతరం ఫీమేల్ పరిచయం అక్కర్లేని గాయని. వెస్ట్ బెంగాల్‌కు చెందిన శ్రేయా 18 భాషల్లో 3000లకు పైగా పాటలు పాడారు. ముఖ్యంగా ఆమె తెలుగులో 280కి పైగా పాటలు పాడితే అందులో 70 శాతం హిట్ పాటలే! శ్రేయా మ్యూజికల్ స్టేజ్ షో చేసిందీ అంటే సంగీత ప్రియులు మైమరచిపోతారు. ఈ తరం ఫీమేల్ సింగర్స్‌లో మొదటి వరుసలో ఆమె ఉన్నారు అనడం అతిశయోక్తి కాదు. మోస్ట్ బిజీయెస్ట్ సింగర్ కూడా! క్లాస్, మాస్, మెలోడీ పాట జానర్ ఏదైనా సరే ఆమె గానానికి ప్రేక్షకుల ఫిదా అయిపోవలసిందే! ఉగాది సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన గద్దర్ అవార్డు వేడుకల్లో ఆమె మెరిశారు. వేదికను ఆ ముందున్న ఆహుతులను కాసేపు షేక్ చేసేశారు శ్రేయా. గద్దర్ అవార్డ్స్ స్టేజ్‌పై సింగర్ శ్రేయ ఘోషల్ తన పాటలతో మాయ చేశారు. 'ఒక్కడు' సినిమాలో 'నువ్వేం మాయ చేశావో కానీ' పాట అందుకోగానే వేదిక ముందున్న ఆ చిత్ర కథానాయిక భూమిక స్వరం కలిపారు. సీఎం రేవంత్ రెడ్డి చేయి కదుపుతూ పాటను ఎంతో ముచ్చటగా విన్నారు. కథానాయికలు రష్మిక, జెనీలియా అయితే చప్పట్లు మోగిస్తూనే ఉన్నారు. అంతగా తన గానం ప్రేక్షకుల్ని మైమరపోయేలా చేసింది.సినిమా ఈవెంట్లు సాధారణంగా వేదికపై నాలుగైదు పాటలు పాడి వెళ్లిపోయే షోలకు శ్రేయాఘోషల్ చాలాకాలంగా దూరంగా ఉంటున్నారు. ఆమె వ్యక్తిగత కాన్సెర్ట్‌లు, ఇతర లైవ్ షోలకు మాత్రమే ఆమె హాజరవు తుంటారు. కానీ కేవలం ఓ ఆరు పాటలు పాడటానికి ఆమె గద్దర్ అవార్డు ఫంక్షన్‌ను వచ్చారంటే విశేషమనే చెప్పాలి. శ్రేయా సంగీత విభావరి ఈ ఈవెంట్‌కు ఓ హైల ఏదేమైనా శ్రేయాఘోషల్ పాడిన పాటలు, ఆమె పెర్‌ఫార్మెన్స్ ఈ ఈవెంట్‌కు హైలైట్ అనే చెప్పాలి.



## నోరా ఫతేహీపై ఫత్వా..

### అశ్లీల సాహిత్యంపై మత పెద్దల అభ్యంతరం

కన్నడ చిత్రం 'కేడీ: ద డెవిల్'లోని 'సర్కే చునార్ తేరి సర్కే' పాట తీవ్ర వివాదాలకు దారితీసిన సంగతి తెలిసిందే. అయితే ఈ పాటలో నటించిన బాలీవుడ్ నటి నోరా ఫతేహీపై అలీగఢ్‌కు చెందిన ముస్లిం పర్సనల్ దారుల్ ఇఫ్తా అనే మతపరమైన సంస్థ ఫత్వా జారీ చేసింది. ఈ పాటలోని సాహిత్యం ఇస్లామిక్ బోధనలకు విరుద్ధంగా ఉందని సదరు సంస్థ పేర్కొంది. ఇటువంటి ప్రదర్శనలు సమాజంలో తప్పుడు సందేశాన్ని పంపుతాయని, ముఖ్యంగా ముస్లిం యువతను తప్పుదోవ పట్టిస్తాయని వారు తమ ఫత్వాలో పేర్కొన్నారు. మరోవైపు ఈ పాటకు దేశవ్యాప్తంగా వస్తున్న నిరసనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ పాటపై నిషేధం విధిస్తూ నిర్ణయం తీసుకుంది. కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ లోక్‌సభలో ఈ విషయాన్ని ధృవీకరించారు.మరోవైపు ఈ వివాదంపై నోరా ఫతేహీ స్పందిస్తూ.. ఈ పాట హిందీ వెర్షన్‌లో తనకేమీ సంబంధం లేదని ఆమె స్పష్టం చేశారు. మూడేళ్ల క్రితం సంజయ్ దత్ వంటి దిగ్గజ నటుడితో కలిసి నటించే అవకాశం రావడం, అలాగే ఇది 'నాయక్ నహి ఖల్ నాయక్ హూ మై' వంటి ఐకానిక్ సాంగ్ రీమేక్ అని భావించి తాను అంగీకరించానని తెలిపారు. తనకు కన్నడ భాష తెలియదని, మేకర్స్ చెప్పిన అనువాదం అప్పట్లో అభ్యంతరకరంగా అనిపించలేదని ఆమె వివరణ ఇచ్చారు. ధ్రువ సర్జా హీరోగా, ప్రేమ్ దర్శకత్వంలో 1970ల నాటి బెంగళూరు నేపథ్యంతో తెరకెక్కిన 'కేడీ: ద డెవిల్' చిత్రం ఏప్రిల్ 30న విడుదల కానుంది.

**ఫత్వా జారీ చేస్తే ఏం అవుతుంది.?**

ఇస్లామిక్ పండితులు ఆధారంగా ఏదైనా ఒక విషయంపై ఇచ్చే వివరణే ఫత్వా. ఉదాహరణకు ఒక పాట లేదా సినిమా ఇస్లామిక్ నియమాలకు వ్యతిరేకంగా ఉందని వారు భావిస్తే, దానిని చూడకూడదని లేదా అది తప్పు అని ఫత్వా ఇస్తారు. అయితే ఫత్వాను గౌరవించి, సదరు వ్యక్తిని లేదా విషయాన్ని దూరం పెట్టే అవకాశం ఉంటుంది. దీనివల్ల వ్యక్తుల ప్రతిష్టకు భంగం కలగడం లేదా వారు సామాజికంగా ఇబ్బందులు ఎదుర్కోవడం జరుగుతుంది. అయితే భారత్ వంటి ప్రజాస్వామ్య దేశాల్లో ఫత్వాకు ఎటువంటి చట్టపరమైన గుర్తింపు లేదు. ఫత్వా జారీ చేసినంత మాత్రాన పోలీసులు ఎవరినీ అరెస్టు చేయలేరు లేదా కోర్టులు దానిని తీర్పుగా పరిగణించవు. రాజ్యాంగం ప్రకారం దేశ చట్టాలే అత్యున్నతమైనవి.


## మరోసారి హిట్ కాంబో..



దిగ్గజ దర్శకుడు మణిరత్నం తన ఆస్థాన సంగీత దర్శకుడు, ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్‌తో మరోసారి చేతులు కలుపబోతున్నాడు. 1992లో 'రోజా' సినిమాతో మొదలైన వీరిద్దరి అద్భుత ప్రయాణం, ఇప్పుడు 19వ సారి ఈ కొత్త సినిమాతో కొనసాగబోతోంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌లో 'మక్కల్ సెల్వన్' విజయ్ సేతుపతి హీరోగా నటించబోతుండగా.. 'నేచురల్ స్టార్' సాయి పల్లవి మణిరత్నం సినిమాలో హీరోయిన్‌గా నటించబోతుంది.గత కొద్ది రోజులుగా ఈ సినిమాకు యువ సంగీత దర్శకుడు సాయి అభ్యంకర్ పనిచేస్తారనే ప్రచారం జరిగినప్పటికీ, వాటన్నింటికీ చెక్ పెడుతూ మద్రాస్ టాకీస్ సంస్థ రెహమాన్ పేరును అధికారికంగా ప్రకటించింది. ఒక ఫీల్ గుడ్ రొమాంటిక్ ఎంటర్టైనర్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రం కోసం రెహమాన్ ఇప్పటికే ఒక పాటను కూడా సిద్ధం చేసినట్లు సమాచారం. మద్రాస్ టాకీస్ మరియు లైకా ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఈ ఏడాది జూలై నాటికి ప్రారంభం కానుంది

## 'ధురంధర్ 2' ప్రశంసల వెనుక ఒత్తిడి రాజకీయాలు?

రణ్‌వీర్ సింగ్ కథానాయకుడిగా, ఆదిత్య ధార్ దర్శకత్వంలో వచ్చిన 'ధురంధర్ 2' చిత్రం బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపిస్తున్న విషయం తెలిసిందే. మొదటి భాగం సృష్టించిన ఇంపాక్ట్‌తో, సీక్వెల్ కోసం ప్రేక్షకులు థియేటర్ల వద్ద బారులు తీరుతున్నారు. కేవలం ఓపెనింగ్ డే రోజే ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా భారీ వసూళ్లను రాబట్టి, ట్రేడ్ వర్గాలను సైతం ఆశ్చర్యపరిచింది. అయితే ఈ సినిమాకు ఒకవైపు భారీ రెస్పాన్స్ వస్తుంటే, మరోవైపు ఇది రాజకీయ ప్రచార చిత్రం (ాతీశీజూఱస్త్రుఅఱ ఖీఱశ్రీఎ) అనే విమర్శలు కూడా బలంగా వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే టాలీవుడ్ టాప్ హీరోలు అల్లు అర్జున్, మహేష్ బాబు, జూనియర్ ఎన్టీఆర్, మరియు విజయ్ దేవరకొండ ఈ చిత్రాన్ని ప్రశంసిస్తూ ఎక్స్ వేదికగా పోస్ట్‌లు పెట్టడం ప్రాధాన్యత సంతరించుకుంది.అయితే ఈ సినిమాపై వస్తున్న ప్రశంసలు వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయని విమర్శలు వస్తున్నాయి. అయితే ఇదే విషయంపై ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్ ఎక్స్ వేదికగా స్పందించాడు. ఉత్తరాదిలో తరచుగా వినిపించే "ఒత్తిడి రాజకీయాలు" ఇప్పుడు టాలీవుడ్‌లోకి కూడా ప్రవేశించాయని, అధికార పార్టీకి అనుకూలంగా ఉండే సినిమాలను ప్రమోట్ చేయాల్సిన పరిస్థితి స్టార్ హీరోలకు వచ్చిందని ఆయన పరోక్షంగా బీజేపీని ఉద్దేశించి విమర్శలు గుప్పించారు.



printed published and owned by CHILVERA SHIVAKUMAR and printed JWAALA PRINTERS H.NO.- 10-15/1/A, KUMMARI GAINI,MANDAL PAPANNAPETA, DISTRICT, MEDAK, TELANGANA- 502303- Gmail.medaktoday94@gmail.com,
Editor: CHILVERA SHIVAKUMAR. RNI NO, TELTEL 2023 ,88524, 9948265095.9494117870..